సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం | 17 | ఆగస్టు | 2023



శ్రావణం..శుభప్రదం..
నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుంది. నెల రోజుల పాటు దేవాలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. - 8లో▸



ఆస్పత్రిలో అగ్నిప్రమాదం
హనుమకొండలోని శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. రూ.70 లక్షల నష్టం వాటిల్లింది. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$33^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అక్రమ వసూళ్లు.. షోకాజ్ నోటీసు జారీ

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్‌ఓ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంప్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్‌పై రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ నవీన్‌మిట్టల్ బుధవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మధుసూదన్ స్టాంప్ వెండర్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓస్టాంప్ వెండర్ ఇటీవల ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ (సీఎస్)కి ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా.. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ఐజీ, ఉమ్మడి వరంగల్ డీఐజీకి నోటీస్ అందజేయగా.. జిల్లా రిజిస్ట్రార్‌కు డీఐజీ నోటీసు జారీ చేసి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో మధుసూదన్ స్టాంప్స్ అక్రమ విక్రయాల్లో సస్పెన్షన్‌కు గురైనా కూడా తీరుమార్చుకోలేదు. మరోసారి వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

గాంధీ బాటలో నడవాలి..



హన్మకొండ అర్బన్: నేటి విద్యార్థులు, యువత గాంధీజీ చూపిన బాటలో నడవాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం నగరంలోని ఏషియన్ శ్రీదేవి మాల్‌లో విద్యార్థులతో కలిసి ఆమె గాంధీ చిత్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 24వ తేదీ వరకు జిల్లాలోని 7 సినిమా హాళ్లలో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని ప్రదర్శిస్తారని, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉచితంగా చూడవచ్చని తెలిపారు. 20వ తేదీ మినహా మిగతా రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ చిత్ర ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

నేడు, రేపు స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న డీఎస్‌ఏ రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలకు ఈనెల 17, 18 తేదీల్లో బ్యాటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లలోపు బాలబాలికలు హాస్టల్‌లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఒరిజినల్ స్టడీ, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, 10 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులకు ఎత్తు, బరువు, ఫ్లైయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800ల మీటర్ల పరుగు, షటిల్‌రన్, మెడిసిన్‌బాల్, స్టాండింగ్ వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమాన్, విష్ణువర్ధన్‌లను 94410 86556, 73864 69301 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


పకడ్బందీగా సర్వే నిర్వహించండి



హన్మకొండ అర్బన్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం నిర్వహించనున్న సర్వేలెన్స్ ఎల్‌సీడీసీ ప్రోగ్రాం పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు సూచించారు. బుధవారం నగరంలోని బాలసముద్రంలోని స్లమ్ ఏరియాలో సర్వేలెన్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ.. ఉదయం 6గంటల నుంచి 9 గంటల వరకు నిర్వహించే ఈసర్వేలో.. ప్రజలు చర్మంపై లేదా రాగి వర్ణపు, స్పర్శ లేని మొద్దు బారిన మచ్చలుంటే తప్పకుండా మీ ప్రాంత ఆశా కార్యకర్తలకు చూపించుకోవాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ అశోక్, వైద్యాధికారి తేజస్విని, సతీశ్‌రెడ్డి, రవీందర్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాన్ని ఈనెల 17న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. గురువారం హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈసమావేశాలు జరుగుతాయని బుధవారం ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు 2, 3, 5, 6 స్థాయీ సంఘాల సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు 4వ స్థాయీ సంఘం సమావేశం, 2.30 గంటలకు 7వ స్థాయీ సంఘం, 3.30 గంటలకు 1వ స్థాయీ సంఘం సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు



మృతులు : ● సురేష్ కురేరి (43) ● జలావత్ దామి అలియాస్ జాబీర్ (19) ● రూప్‌చంద్ దామి(33) ● నితీష్ కుమార్ కురేరి (11) ● ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ (42) ● అమిత్ కురేరి (23)
గాయపడింది : ● అమీర్ కురేరి

హైవే జర్నీ.. హార్రరే..!

కమిషనరేట్ పరిధిలోని హైవేలపై ప్రమాదాలిలా...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	600	215	635
2022	580	208	559
2023	481	134	454

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు

- జనవరి నుంచి ఇప్పటివరకు 481 ప్రమాదాల్లో 134 మంది దుర్మరణం
- డ్రైవర్ల స్వీయ తప్పిదాలతోనే అనేక మంది ప్రాణాలు గాల్లోకి
- ఇల్లంద గ్రామంలో జరిగిన ఘోర ప్రమాద ఘటన చెబుతున్నదిదే

సాక్షి, వరంగల్: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఉన్న మూడు ప్రధాన జాతీయ రహదారుల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు హర్రర్ సృష్టిస్తున్నాయి. 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 481 రోడ్డు ప్రమాదాలు జరిగి 134 మంది దుర్మరణం చెందితే...454 మంది క్షతగాత్రులయ్యారు. నేషనల్ హైవే 163, 563, 365లలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా అతి వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ఆగి ఉన్న వాహనాలను గ మనించకుండానే దూసుకెళ్లడం, రాంగ్ రూట్ డ్రైవింగ్.. తదితర తప్పిదాలతో జరుగుతున్నాయి. ప్రాణాలు పోతున్నాయి. జిల్లాలోని వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిలోని ఇల్లంద గ్రామంలో బుధవారం ఉదయం 7.12 గంటల ప్రాంతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. కేవలం మూడు సెకన్ల వ్యవధిలో లారీ భయానకం సృష్టించి ఆటోను ఈడ్చుకెళ్లి ఆరుగురి ప్రాణాలను బలిగొన్న ఘటన చర్చనీయాంశమైంది. ఇల్లంద గ్రామంలోని రహదారిపై ప్రధాన ప్రాంతాల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం కూడా ఈ ప్రమాదానికి కారణమన్న చర్చ జరుగుతోంది. వేగ నియంత్రణ సూచిక బోర్డులు కూడా లేకపోవడంతో తరచూ ఈ హైవేలపై ప్రమాదాలు జరుగుతున్నాయని హైవే వెంట ఉన్న గ్రామాల ప్రజలు అంటున్నారు.

మరికొన్ని ప్రమాదాలిలా...

- ఆగస్టు 9న నర్సంపేట శివారులోని జాతీయ రహదారి 365పై కమలాపురం క్రాస్ వద్ద ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ప్రయాణిస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఏడుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఉన్న బెలూన్లు ఓపెన్ కావడంతో పెద్ది స్వప్నకు ప్రాణాపాయం తప్పింది.
- జూలై 17న వర్ధన్నపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదుట హైవే మార్గంలో డీసీఎం వ్యాన్ ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక భాగంలో ఢీకొట్టడంతో డీసీఎం వ్యాన్ డ్రైవర్ తోట రాజేష్(40) వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు.
- జనవరి 21వ తేదీన నల్లబెల్లి క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారి 365పై జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లబెల్లి మండలంలోని అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎండీ బాబర్ (47) చనిపోయాడు. బాబర్ ద్విచక్రవాహనంపై వస్తుండగా ఎర్రమట్టి లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.



కుటుంబ సభ్యులను కబళించిన లారీ..

జూన్ 25న వరంగల్ నగరంలోని కాశిబుగ్గ సొసైటీ కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన వారు మేడారం నుంచి తిరిగి వస్తున్న క్రమంలో ఆత్మకూరు శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న అనుముల నర్సింహస్వామి(52)తోపాటు ఆయన కుమార్తె వెల్దెండి ఆకాంక్ష(26), అల్లుడు సాంబరాజు(40), మనుమరాలు లక్ష్మీప్రసన్న(9) అక్కడికక్కడే మృతిచెందారు. కాగా నర్సింహస్వామి భార్య రాజశ్రీ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందింది.



స్నేహితులిద్దరూ..

జూలై 15వ తేదీన రఘునాథపల్లి మండలం కోమల్ల టోల్ ప్లాజా వద్ద రోడ్డు ప్రమాదంలో విదేశాలకు ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్తున్న స్నేహితుడికి ఆనందంగా వీడ్కోలు పలికి తిరిగి వస్తున్న ఇద్దరు స్నేహితులు అనంత లోకాలకు వెళ్లారు. రహదారి పక్కన నిర్లక్ష్యంగా నిలిపిన లారీని బొలెరో వాహనం ఢీకొట్టడంతో హనుమకొండ గాంధీ నగర్‌కు చెందిన వొడ్లకొండ రాకేష్, నయీంనగర్‌కు చెందిన వడ్డేపల్లి సందీప్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

వలస జీవులను మింగిన లారీ

- లారీడ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- ఆటోను ఈడ్చుకుపోవడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- ఆరుగురు దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- మృతుల్లో ఐదుగురు జైపూర్‌వాసులు, ఒకరు ఆటోడ్రైవర్

అంతా మూడు సెకన్లలోనే...

వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిలోని వరంగల్ జిల్లా ఇల్లంద గ్రామంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇల్లంద గ్రామం మరో 100 మీటర్లయితే ఆటో దాటుతున్నామనుకున్న క్రమంలో సరిగ్గా ఉదయం ఏడు గంటల 12 నిమిషాల 43 సెకన్లలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇల్లంద గ్రామంలోని రాఘవేంద్ర కిరాణంలో రికార్డైన సీసీటీవీ కెమెరాల్లో ఏడు గంటల 12 నిమిషాల 43 సెకన్లకు ఆటో వర్ధన్నపేట వైపునకు వెళుతోంది. సరిగ్గా మూడు సెకన్లలో మళ్లీ ఆ ఆటో తిరిగి లారీ ఢీకొనడంతో దాని ముందుభాగంతోనే వెనక్కి వచ్చి అదే కిరాణం ఎదురుగా ఆగింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి ఆటో నుంచి ఎగిరి రోడ్డు పక్కనే పడిపోయాడు. మిగతా ఆరుగురు వ్యక్తులు ఆటోలో ఇరుక్కుని మాంసం ముద్దలుగా అయ్యి సంఘటనస్థలి భీతావహంగా మారింది.

ఘటనాస్థలిలో సీపీ



వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లారీ ఎక్కడినుంచి వచ్చింది.. ఆటోను ఎంతదూరం ఈడ్చుకెళ్లింది.. ఘటనస్థలి వద్ద పరిస్థితి ఏమిటన్నది క్షుణ్ణంగా పరిశీలించారు. సమీపంలో రికార్డ్ అయిన సీసీ టీవీ ఫుటేజీని చూశారు. ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను, ప్రమాదానికి కారణమైన లారీని పరిశీలించారు.

- సాక్షి వరంగల్/వరంగల్/ఖిలావరంగల్ - పూర్తి వివరాలు 8లో▸

అమ్మా వస్తున్నా.. అంతలోనే దుర్మరణం
కన్నీరుమున్నీరవుతున్న ఆటోడ్రైవర్ శ్రీనివాస్ కుటుంబం - 8లో▸

అప్రమత్తతతోనే అందరూ క్షేమం..



హైవేలపై వెళ్లే వాహనదారులు డ్రైవింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. వారితోపాటు ఎదుటివారి ప్రాణాలకు నష్టం కలిగించినట్టే లెక్క. ఇల్లందలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ తరహా ఘటనలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తాం.

- ఏవీ.రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

నాలా పునరుద్ధరణకు ప్రతిపాదనలు

హన్మకొండ: నాలా పునరుద్ధరణకు ప్రతిపాదనలు రూపొందించి మంజూరు కోసం ప్రభుత్వానికి పంపనున్నట్లు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇటీవలి వర్షం, వరద తీవ్రతకు హనుమకొండ 100 ఫీట్ల రోడ్డును ఆనుకుని ఉన్న నాలకు నిర్మించిన రివిట్‌మెంట్‌వాల్ కూలింది. పలు చోట్ల కొట్టుకుపోయింది. రోడ్డుకు అవతలి వైపునకు వెళ్లేందుకు నాలాపై నిర్మించిన వంతెనలు కూలిపోయాయి. ఈసమస్యలన్నీ 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, సుధాకర్‌రెడ్డి దంపతులు నీటి పారుదల శాఖ ఎస్‌ఈ దృష్టికి తీసుకెళ్లారు. నాలాను పునరుద్ధరించాలని, రివిట్‌మెంట్ వాల్ నిర్మించాలని కోరడంతో బుధవారం ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలాను ఆనుకుని ఉన్న కాలనీవాసులు ఆయనకు సమస్యల్ని వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. ఈసందర్భంగా నీటి పారుదల శాఖ ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారీ వర్షానికి వచ్చిన వరద తీవ్రతతో నాలా దెబ్బతిన్నదని, నాలా పటిష్టానికి చర్యలు తీసుకుంటామన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి

100 ఫీట్ల రోడ్డు అడుగు భాగంలో నిర్మించిన డక్ట్ అండ్ డ్రెయిన్ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. డక్ట్ అండ్ డ్రెయిన్ నిర్మించకపోతే చాలా కాలనీలు ముంపునకు గురయ్యేవన్నారు. ఆర్అండ్‌బీ డీఈ సురేశ్‌తో మాట్లాడి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, రిటైర్డ్ ఎస్‌ఈ నల్ల సుధాకర్‌రెడ్డి, టీవీ టవర్ కాలనీ అధ్యక్షుడు పల్లెపాటి సమ్మిరెడ్డి, కార్యదర్శి కిషన్‌రెడ్డి, ఆయా కాలనీల వాసులు మల్లా రెడ్డి, మొగిలయ్య, సంతోశ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

నగర సమస్యలపై మహోద్యమం

- డీసీసీ హనుమకొండ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి
- సమస్యలు పరిష్కరించకపోతే 25న నగర బంద్



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: వరంగల్ మహానగర సమస్యలపై మహోద్యమం చేపడతామని కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని విశాల్ భవన్‌లో వరంగల్ మహానగర (ట్రైసిటీ) సమస్యలపై అఖిలపక్ష సమావేశం జరిగింది. ఇందులో ఆయా పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. నాయిని రాజేందర్ మాట్లాడుతూ.. వరద ముంపు బాధితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కనీసం నిత్యావసరాలు కూడా పంపిణీ చేయలేదని దుయ్యబట్టారు. వరద నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలాలు, డ్రెయినేజీలపై నిర్మించిన అక్రమ కట్టడాలపై ఎప్పటిలోగా చర్యలు తీసుకుంటారో చెప్పాలన్నారు. వరద బీభత్సానికి పాడైన రోడ్లు, నాలాలు, డ్రెయినేజీలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నగర ప్రజలను ముంపు నుంచి కాపాడేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకుంటే 25న నగర బంద్‌కు పిలుపునిచ్చి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఆచార్య కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేలు నగరం చుట్టూ భూములు ఆక్రమించుకుని వెంచర్లు చేసి నగరాన్ని ముంచుతున్నారని ఆరోపించారు. ఐటీ పార్కు, విమానాశ్రయానికి స్థలం ఇవ్వలేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ నాయకుడు భిక్షపతి, న్యూడెమొక్రసీ నాయకుడు నున్నా అప్పారావు, టీడీపీ నాయకులు రహీం, బీఎస్పీ నుంచి కన్నం సునీల్, వైఎస్ఆర్ టీపీ నుంచి కొటిల్‌రెడ్డి, ఏఐఎంఐఎం నుంచి సుభాన్, ప్రజా వేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు మాట్లాడారు. వీరితో పాటు ఆయా సంఘాలు, పార్టీల నాయకులు మంద వీరస్వామి, చుంచు రాజేందర్, పుట్ట రవి, నమిండ్ల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, శ్రీమాన్, సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, సోమ రామూర్తి, సాయిని నరేందర్, తిరుపతి యాదవ్, పిట్టల శ్రీనివాస్, డాక్టర్ కె.వీరస్వామి, కె.శివాజీ, ఎస్‌కే.బాబా ఖాదర్ అలీ, కె.జయశంకర్, ఎం.మనోహర్ పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా ఓటరు జాబితా సిద్ధం



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: నిర్ణీత సమయంలోగా.. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, స్పష్టమైన ఫొటో ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల ప్రక్రియపై సంయుక్త ముఖ్య ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 19న ప్రజల అవగాహన కోసం నిర్వహించే 5కే రన్ కార్యక్రమం విజయవంతానికి జిల్లావ్యాప్తంగా అధికారులు సమన్వయంతో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

ఓటరు నమోదుకు కార్యాచరణ రూపొందించాలి : కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా నూతన ఓటర్ల నమోదు కోసం కార్యాచరణ రూపొందించుకుని పకడ్బందీగా అమలు చేసే విధంగా జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర సంయుక్త ముఖ్య ఎన్నికల అధికారి సర్ఫరాజ్‌అహ్మద్ అన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో బుధవారం హైదరాబాద్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ఫరాజ్‌అహ్మద్ మాట్లాడుతూ ఈ నెల 19న ఉదయం 6 గంటలకు 'ఐ ఓట్ ఫర్ షూర్' (నేను కచ్చితంగా ఓటు వేస్తాను) అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 5కే రన్ విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య, అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, అధికారులు పాల్గొన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి



దేశాయిపేట యూపీహెచ్‌సీలో మాట్లాడుతున్న వరంగల్ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

వరంగల్ : దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 100 శాతం కుష్టు నివారణకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమాన్ని దేశాయిపేట యూపీహెచ్‌సీలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల సూచికల ప్రకారం 100 శాతం పూర్తి చేయాలని, అందులో భాగంగానే ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య పర్యవేక్షకులు, స్వచ్ఛంద సంస్థలు ఇంటింటా సర్వే చేయాలని పేర్కొన్నారు. 31వ తేదీ వరకు జిల్లాలో ప్రజలందరినీ స్క్రీనింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారెడ్డి, ఫిజియోథెరపిస్ట్, వైద్యాధికారి భరత్‌కుమార్, సిబ్బంది నవీన్, రాజ్‌కుమార్, ప్రసాద్, కొర్నెల్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేలానికి ఉనికిచర్లలో లే ఔట్ ప్లాట్లు

'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్/నయీంనగర్: కాకతీయ అర్బన్ డెవలమెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 11 గంటల నుంచి ఉనికిచర్లలో యుని సిటీ లే ఔట్ రెసిడెన్షియల్ ప్లాట్లకు వేలం నిర్వహిస్తున్నట్లు 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ధర్మసాగర్ మండలంలోని ఉనికిచర్లలో చేస్తున్న కుడా లే అవుట్ ప్లాట్ల రోడ్లు, ఇతర ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించి సమర్థవంతంగా చేసేందుకు అధికారులకు పలు సూచనలందించారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. కుడా ఆధ్వర్యంలో ఉనికిచర్లలో 135 ఎకరాల్లో యుని సిటీ వెంచర్‌లో తాగునీరు, వాటర్ ట్యాంక్, అండర్ డ్రెయినేజీ, 40 ఫీట్ల రోడ్డు, 100శాతం వాస్తు, అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ, చిల్డ్రన్ పార్క్, అవెన్యూ ప్లాంటేషన్‌తో ఎంతో అద్భుతంగా ప్లాట్లు చేసినట్లు తెలిపారు. నేషనల్ హైవే ఓఆర్ఆర్ నుంచి అతి సమీపంలో అద్భుతమైన రోడ్డు సౌకర్యం ఉందన్నారు. ప్రస్తుతం 50 ప్లాట్లను వేలం వేయనున్నట్లు తెలిపారు. 200, 300 గజాల ప్లాట్లను తయారు చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.25వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, యూఏఈ సిద్ధార్థనాయక్ తదితరులు ఉన్నారు.



ప్లాట్లను పరిశీలిస్తున్న 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా, అధికారులు బృందం

12వ రోజు 493 దరఖాస్తులు

కాజీపేట అర్బన్: వరంగల్ అర్బన్ జిల్లాలో నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని 65 వైన్స్‌కుగాను బుధవారం 493 దరఖాస్తులు అందాయి. హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ దరఖాస్తులు స్వీకరించారు. వరంగల్ అర్బన్ జిల్లాలోని వరంగల్ అర్బన్ ఎక్సైజ్‌స్టేషన్‌కు 60 దరఖాస్తులు, ఖిలా వరంగల్‌కు 82, కాజీపేటకు 110, హనుమకొండ ఎక్సైజ్‌స్టేషన్‌కు 232 దరఖాస్తులు అందగా.. 12 రోజుల్లో 1,893 దరఖాస్తులు అందాయి.

శ్రావణం.. శుభప్రదం..

రోజూ పండుగే, ప్రతీ తిథి దివ్యముహూర్తమే..

- నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం
- ఉప్పొంగనున్న భక్తిపారవశ్యం
- వేడుకలకు దేవాలయాలు సిద్ధం

శ్రావణం.. శుభప్రదం. ఈ మాసంలో రోజూ పండుగే. ప్రతీ గడియ లక్ష్మీకటాక్షమే. ప్రతీ తిథి దివ్యముహూర్తమే. నెలంతా ఆధ్యాత్మికమే. చెట్టు.. పుట్టా.. గుడి.. రాయి.. ఇలా ప్రతీ చోటు భక్తజనులతో మొక్కులు అందుకుంటాయి. ఎక్కడ చూసినా భక్తి పారవశ్యమే కనిపిస్తుంది. ఏ కార్యం మొదలు పెట్టినా శుభకరమే. అందుకే శ్రావణమాసానికి ఇంతటి ప్రాముఖ్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభంకానుంది. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం

హన్మకొండ కల్చరల్ : ఈ సంవత్సరం రెండు శ్రావణమాసాలు రావడంలో బుధవారం అధిక శ్రావణమాసం ముగిసి నేటి నుంచి (గురువారం) నిజశ్రావణమాసం ప్రారంభమవుతోంది. ఈ నేపథ్యంలో మహిళలు తమ ఇండ్లల్లో రోజూ సుగంధపరిమాళాలతో ధూపదీపాలతో వివిధ రకాల నైవేద్యాలు సమర్పిస్తూ పూజలు జరుపుకుంటారు. కాగా, శ్రావణమాసం ఈ నెల 17వ తేదీన (గురువారం) ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 14వతేదీ (గురువారం) వరకు ఉంటుంది.

ప్రతిరోజూ ప్రత్యేకం...

శ్రావణమాసంలో సోమ, మంగళ, శుక్ర, శనివారాలను పవిత్రమైనవిగా భావిస్తారు. ఈ రోజులలో నియమనిష్టను పాటిస్తారు. శ్రావణ సోమవారం శివుడికి ప్రీతికరమైనరోజు, అలాగే శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మంగళవారం మంగళగౌరివ్రతాలను చేస్తారు. గురువారం సాయిబాబా ఆలయాల్లో అఖండసాయినామయజ్ఞాలు జరుగుతాయి. శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకున్నవారికి పుణ్యంతో పాటు లక్ష్మీప్రసన్నం కూడా జరుగుతుందని నమ్ముతారు. శనివారాలలో వేంకటేశ్వరస్వామి వారి దేవాలయాలలో ప్రత్యేకపూజలు జరుగుతాయి.

దేవాలయాల్లో ఏర్పాట్లు...

జిల్లాలోని అన్ని దేవాలయాలను అలంకరించారు. వరంగల్ ఎంజీఎం ఎదుట ఉన్న రాజరాజేశ్వరి దేవాలయం, హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత ఆలయం, లష్కర్‌బజార్‌లోని సంతోషిమాత ఆలయం, హన్మకొండ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంతో పాటు నగరంలోని పలు వేంకటేశ్వరస్వామి ఆలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ శ్రావణమాసపూజలు పండితప్రవచనాలు ఏర్పాటు చేశారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

రుద్రేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసోత్సవాలలో భాగంగా గురువారం రుద్రేశ్వరశివలింగానికి సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నారు. 21న (సోమవారం) పంచమితిథిరోజు నాగపూజలు, 31న (గురువారం) రక్షాబంధనం ఉపాకర్మ పూజలు, సెప్టెంబర్ 13న (బుధవారం) మాసశివరాత్రి పూజలు, ఉదయం 11గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. శ్రావణమాసంలో శివాలయాలలో పూజలు నిర్వహిస్తే సత్ఫలితాలు అందుతాయని ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. అష్టోత్తరనామార్చనలకు రూ. 50, రుద్రాభిషేకానికి రూ. 200, నెలరోజుల అభిషేకం చేయించుకు భక్తులు ఆలయంలోని బుకింగ్ కౌంటర్‌వద్ద రూ. 1,000 చెల్లించి రశీదు పొందాలని ఆలయ ఈఓ వెంకటయ్య తెలిపారు.

> **శ్రావణమాస తిథుల ప్రత్యేకత..**
> **రేపు (శుక్రవారం) శ్రావణశుద్ధ విదియరోజు వాసుదేవార్చన, లక్ష్మీపూజలు, అమ్మవార్లకు కుంకుమపూజలు వరలక్ష్మీవ్రతం ఆచరిస్తారు.**



శ్రావణమాసంలో లక్ష్మీ అమ్మవారికి, గౌరీశంకరులకు పూజలు (ఫైల్)

కాళేశ్వరం..భక్తిపారవశ్యం

- నేటి నుంచి కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాస వేడుకలు



శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి జోడు లింగాలు

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరాలయంలో నేటి(గురువారం) నుంచి శ్రావణమాసం నెల ప్రారంభం కానుంది. ఈ నెల రోజుల పాటు కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు శుభానందదేవి అమ్మవారు, సరస్వతి అమ్మవార్లకు, ఆలయ ప్రాకార దేవతలకు విశేష పూజలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14 వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈనెల 25న వరలక్ష్మీ వ్రతం సామూహింగా నిర్వహించనున్నారు. కాగా, నిజశ్రావణమాసంలో పూజలు నిర్వహించడానికి భక్తులు ఇప్పటికే ఈ నెల 30వ తేదీ వరకు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు.

తెలంగాణ జీవన ప్రతీక.. బోనాలు

- ఉత్సవాల నిర్వహణకు సిద్ధం

బోనాల పండుగ.. తెలంగాణ జీవన విధానానికి ప్రతీక.. ఈ పండుగ సందర్భంగా శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లతో ఊరు మొత్తం దద్దరిల్లుతుంది. ఈ సమయంలో ప్రతి ఇంటి నుంచి బోనం కదలుతుంది. ఆడపడుచులు బోనం ఎత్తుకుని తన్మయత్వంతో ర్యాలీగా బయలుదేరి ఆలయానికి చేరుకుంటున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి తనివితీరా బోనం సమర్పిస్తారు. ఈ సందర్భంగా పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని మనసారా వేడుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ జాతరకు సమయం వచ్చింది.



బోనం ఎత్తుకున్న మహిళలు(ఫైల్)

కాజీపేట: శ్రావణమాసం ప్రారంభంతో రాష్ట్రంలో బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. ఏటా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ జాతర ఉత్సవాలు ముగిసిన వారం రోజుల్లో జిల్లాలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అయితే ఈ ఏడాది అధిక శ్రావణ మాసం రావడంతో ఉత్సవాలు నెల రోజుల పాటు ఆలస్యంగా మొదలవుతున్నాయి. ఈ క్రమంలో బుధ, ఆదివారాల్లో పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పండుగను నిర్వహించుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చల్లని తల్లిగా పిలువబడే పోచమ్మ ఆలయం లేని గ్రామం , పట్టణం ఉండదంటే అతిశయోక్తి కాదని చెప్పొచ్చు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 2వేలకు పైగా పోచమ్మ తల్లి ఆలయాలు ఉన్నాయి. నగరాలు, పట్టణాల్లో రెండు, మూడు కాలనీలకు ఒక పోచమ్మ ఆలయం ఉంటుంది. హిందు సంప్రాదాయాన్ని అనుసరించి శ్రావణ మాసంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ తల్లికి బోనం సమర్పిస్తారు. కాగా, ట్రైసిటీగా పిలువబడే వరంగల్ నగరంలో కనివిని ఎరుగని తీతిలో ఉత్సవాలు నిర్వహిస్తారు. కాజీపేట, పోచమ్మకుంట, రంగశాయిపేట, మడికొండ, హనుమకొండ తదితర ప్రాంతాల్లో గొర్రె, పొట్టేళ్లతో ప్రత్యేక రథాలను తయారు చేసి అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తన్మయం పొందుతారు.

గ్రామ దేవతల అనుగ్రహం కోసం...

జిల్లాల్లో ఆదివారం లేదా బుధవారం జాతర పేర ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. ఏడుగురు గ్రామదేవతలైనా పోచమ్మ, మైసమ్మ, బాలమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ వీరికి తోడుగా గ్రామాన్ని కాపాడే పోతురాజు అనుగ్రహం కోసం ముత్తయిదువులు బోనాలు సమర్పించి పూజలు చేస్తారు. స్థానికులు ఆయా దేవాలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఊరు ఊరంతా ఈ సందడిలో భాగస్వామ్యం పంచుకుంటుంది.

భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం



నేను, మా వారు అమెరికాలో ఉంటాం. నా చిన్నప్పటి నుంచి మా అమ్మ వరలక్ష్మి వ్రతం రోజు అమ్మవారి రూపంతో అలంకరణ చేస్తుంది. శ్రావణమాసమంతా మా ఇంట్లో సువాసనలు వెదజల్లుతాయి. భక్తిభావనతో మనసు ఆహ్లాదకరం, ప్రశాంతగా అనిపిస్తుంది.

- వెగ్గళం నికిష , కాశిబుగ్గ, వరంగల్

భక్తి, విశ్వాసంతో పూజ చేయాలి



శ్రావణమాసం ప్రారంభమవుతుందంటే మా ఇంట్లో సందడి మొదలవుతుంది. అమ్మవారిని భక్తి, విశ్వాసంతో పూజిస్తే మనకు సకల సంపదలను పొందేలా అనుగ్రహిస్తుంది. మన పిల్లలకు పండుగల విశిష్టతను తెలియజేస్తూ పూజలలో వారిని భాగస్వాములు చేయాలి.

- గంపా శైలజాశరత్, శ్రీదుర్గా నృత్యాలయం నిర్వాహకురాలు, గోపాల్‌పూర్, హనుమకొండ

వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం...



శ్రావణమాసంలో మా కోడలు, మా కూతురుతో కలిసి వరలక్ష్మీవ్రతం చేసుకుంటాం. అలాగే, వేంకటేశ్వరస్వామి జ్యోతి వ్రతం జరుపుకుంటాం.అనంతరం మా ఇంట్లోని పెద్దవారితో ఆశీర్వచనం తీసుకుంటాం. దీని వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది.

-వలబోజు రమాదేవి, గృహిణి, కిషన్‌పురా, హనుమకొండ

మహిళ మృతదేహం లభ్యం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ సమీపంలో జంపన్నవాగు, గోదావరి నది కలిసే సంఘం పాయ వద్ద తుప్పల్లో బుధవారం శిథిలమైన ఓ మహిళ మృతదేహం చిక్కుకొని ఉంది. ఈ మృతదేహాన్ని చూసిన గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహంపై ఉన్న గుర్తులను సేకరించారు. మృతురాలు ఆరెంజ్ కలర్ చీర, బ్లూ కలర్ షెటర్ ధరించి ఉంది. ఆమె వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎరుపు రంగు చద్దరు కూడా ఉందన్నారు. ఈ ఆనవాళ్లను గుర్తుపడితే 8712670090 నంబర్‌లో తమను సంప్రదించాలన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆస్పత్రిలో అగ్నిప్రమాదం..

- సుమారు రూ. 70లక్షల ఆస్తి నష్టం
- సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని వేయి స్తంభాలగుడి ఎదుట గల శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. అప్రమత్తమైన ఆస్పత్రి సిబ్బంది అగ్నిమాపక శాఖకు సమాచారం అందజేయండంతో వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదాన్ని ప్రాథమిక దశలోనే అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ఓ కె జయపాల్‌రెడ్డి, ఎస్ఎఫ్ఓ ఏ నాగరాజు, ఆస్పత్రి సిబ్బంది కథన ప్రకారం ఆస్పత్రి మొదటి అంతస్తులోని ఆపరేషన్ థియేటర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడంతో మిషనరీ పేలి ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులు భయాందోళనలకు గురయ్యారు. ఏంజరుగుతుందో తెలుసుకునే లోపే దట్టమైన పొగలు ఆస్పత్రిని కమ్మేసాయి. అప్రమత్తమైన ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో పాటు సిబ్బంది సాయంతో 12మంది రోగులను కుడా తరలించారు. సమాచారం అందుకున్న నిమిషాల వ్యవధిలోనే చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాదం జరిగిన మొదటి అంతస్తులోకి అద్దాలను పగలగొట్టి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 లక్షల ఆస్తి నష్టం జరిగిందని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలిని డీఎఫ్ఓ టి వెంకన్న సందర్శించారు. ఫైర్ సిబ్బంది ఏ శ్రీనివాసరావు, బి సుధాకర్‌రెడ్డి, ఎండీ యాకూబ్, ఏ రూప్‌సింగ్, ఏ రవీందర్‌రెడ్డి, కె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

గంగారం : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం గంగారం మండలం కొడిశలమిట్ట గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఈసల రాజేష్ (28) తన పొలం వద్ద మోటార్ ఫీజులు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానికులు గమనించి వెంటనే 108లో గంగారం పీహెచ్‌సీకీ తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య ప్రియాంక, ఐదునెలల పాప ఉంది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

నిందితుల అరెస్ట్

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామంలో తమ డబ్బు చోరీ చేశారని ఆరోపిస్తూ బాలికలను హింసించిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పుస్కూరి మధుకర్‌రావు, ఆయన భార్య సునీత, పుస్కూరి ప్రభాకర్‌రావు ఆయన భార్య రాణి, వీరి సమీప బంధువులు వెంకటేశ్వర్‌రావు, సీతారామరావును అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడిపై పోలీసుల దాడి

- కోర్టు ఆవరణలో ఘటన
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



మాట్లాడుతున్న అజయ్

జనగామ: కోర్టు ఆవరణలో ఓ యువకుడిపై పోలీసుల విచక్షణాహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై జిల్లా వ్యాప్తంగా పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుడు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పాంనూర్‌కు చెందిన కలకొల అజయ్ కథనం ప్రకారం ఇటీవల నర్మెట మండలంలో తన భూమి కబ్జా చేస్తున్నారని భార్యాభర్తలు సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. ఇందులో జేసీబీ ఆపరేటర్ టేకుల రమేష్‌ను నర్మెట పోలీసులు కోర్టులో రిమాండ్ చేస్తున్న క్రమంలో అతడి బావ అజయ్ కేసు విషయమై ఆరా తీశాడు. దీంతో కేసు విషయం అడుగుతారా అంటూ నలుగురు పోలీసులు తనను విచక్షణారహింగా కొట్టారని అజయ్ తెలిపారు. దాడి చేసే క్రమంలో వీడియో తీయగా దానిని డిలీట్ చేయించారన్నారు. ఈ ఘటనపలో కానిస్టేబుళ్లపై జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఇదిలా ఉండగా.. జనసేన పార్టీ స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె పృథ్వీ మాట్లాడుతూ కుటుంబ సభ్యుడి రిమాండ్ వివరాలు అడిగితే పోలీసు ఇలా వ్యవహరించడం హేయమన్నారు. ఈ విషయమై నర్మెట సీఐ నాగబాబును వివరణ కోరగా అజయ్‌ని పోలీసులు కొట్టలేదన్నారు. రమేష్‌ను కోర్టులో ప్రొడ్యూస్ చేసేందుకు ఉదయం 7.30 గంటలకు తీసుకు రాగా అజయ్ అక్కడకు న్యూసెన్స్ చేశారన్నారు. పోలీసులు రిమాండ్‌కు సంబంధించి పత్రాలు రాసే క్రమంలో వీడియో తీయగా దీనిని డిలిట్ చేసి వెళ్లి పోవాలని కోరామే తప్ప.. కొట్టినట్లు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

వలస జీవులను మింగిన లారీ..

- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం
- ఆటోను ఈడ్చుకుపోవడంతో పెరిగిన ప్రమాద తీవ్రత
- ఆరుగురి దుర్మరణం.. మరొకరి పరిస్థితి విషమం
- వర్ధన్నపేట మండలం ఇల్లందలో ఘోర రోడ్డు ప్రమాదం



ఆటో నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు



ఆటో ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు



నుజ్జునుజ్జు అయిన ఆటోను పరిశీలిస్తున్న సీపీ

వరంగల్: వలస జీవులను లారీ మింగేసింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ఆరుగురు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆయా కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన సుమారు పది కుటుంబాలు తేనే సేకరణ కోసం వరంగల్ జిల్లా కేంద్రానికి వచ్చి ఓసిటీ మైదానంలో డేరాలు వేసుకుని నివాసం ఉంటున్నాయి. నెల రోజుల క్రితం వచ్చిన ఈ వలసజీవులు నిత్యం ఉదయమే ఇక్కడ నుంచి ఆటోల్లో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి తేనె సేకరించి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. రోజుమాదిరిగానే బుధవారం ఉదయం రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు ఒక ఆటోలో వర్ధన్నపేట, తొర్రూరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద లారీ రాంగ్‌రూట్‌లో వచ్చి ఆటోను ఢీకొంది. అలాగే కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తుల్లో ఒకే కుటుంబానికి చెందిన కురేరి సురేష్ (43), అతడి కుమారులు అమిత్ కురేరి (23), నితీష్ కుమార్ కురేరి (11), సురేష్ సోదరి కుమారులు (మేనల్లుళ్లు) రూప్‌చంద్ దామి(33), జలావత్ దామి అలియాస్ జాబీర్ (19)తోపాటు ఆటోడ్రైవర్ నగరంలోని కరీమాబాద్ ఏసీరెడ్డి నగర్‌కు చెందిన బట్టు శ్రీనివాస్ (42)మృతి చెందారు. మృతుడి కురేరి సురేష్ మరో కుమారుడు అమీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు ప్రీతి, పూజ తెలిపారు.

ఆకలి తీర్చిన వ్యాపారులు..

రెండు కుటుంబాలకు చెందిన ఐదుగురు మృతి చెందారని తెలుసుకున్న లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌కు చెందిన పలువురు వ్యాపారులు చలించారు. తమ కుటుంబ సభ్యులు మృతి చెందారని, అందుకే ఉదయం నుంచి ఏమి తినలేదని చెప్పడంతో భోజనం తయారు చేయించి వారి ఆకలి తీర్చినట్లు వ్యాపారులు బిట్ల కృష్ణ, పాపాని భాస్కర్, బూర ప్రకాశ్ తెలిపారు.

అమ్మా వస్తున్నా.. అంతలోనే దుర్మరణం

- రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్ మృతి
- శోకసంద్రంలో కుటుంబం



శ్రీనివాస్ (ఫైల్)


ఖిలా వరంగల్: అమ్మా వస్తున్నా...కలిసి భోజనం చేద్దాం అంటివి.. అంతలోనే మాయమైనవా.. రెండు రోజులాయే నా చేతి కూడు తినక కొడుకా...తినకుండానే వెళ్లిపోయినావా .. అంటూ ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ తల్లి రాజమ్మ రోదిస్తుంటే అక్కడున్న వాళ్లంతా కంటితడి పెట్టుకున్నారు. వర్ధన్నపేట మండలం ఇల్లందలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురిలో ఆటోడ్రైవర్ బట్టు శ్రీనివాస్ కూడా ఉన్నారు. శ్రీనివాస్‌కు పదేళ్ల క్రితం వివాహం జరగగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. తొమ్మిది నెలల క్రితం బతుకుదెరువు కోసం భార్య కల్పన, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులతో రెండు నెలల క్రితం భార్య కల్పన తన పిల్లలను వెంటబెట్టుకుని నర్సంపేట ద్వారక పేటలోని పుట్టింటికి వెళ్లిపోగా.. శ్రీనివాస్ మాత్రం పుప్పాలగుట్ట ఏసీరెడ్డినగర్‌లోని తన పెద్దన్న నివాసం ఉండే తల్లి రాజమ్మ ఇంటికి చేరుకున్నాడు. అతను ప్రస్తుతం నాగమయ్య టెంపుల్ సమీప కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని అద్దె ఆటో నడిపిస్తున్నాడు. బుధవారం ఉదమే యజమానికి ఆటో ఇచ్చేసి ఇంటికి వస్తాననుకున్నాడు. ఈ లోపు ఓసిటీలో డేరాలు ఏర్పాటు చేసుకున్న జైపూర్‌కు చెందిన వలస జీవులు అండర్ బ్రిడ్జి వద్ద బట్టు శ్రీనివాస్ ఆటో ఎక్కి తొర్రూరులో దించాలని కోరారు. దీంతో వారిని ఎక్కించుకుని బయలుదేరగా ఇల్లంద వద్ద లారీ ఢీకొంది. దీంతో శ్రీనివాస్ మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో శ్రీనివాస్ సోదరుడు బట్టు కిషన్, వదిన మాలతీ, మృతుడి తల్లి రాజమ్మ, నర్సంపేట నుంచి చేరుకున్న భార్య కల్పన, ఇద్దరు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీంతో వరంగల్ పుప్పాలగుట్ట ఏసిరెడ్డినగర్‌లో విషాదం నెలకొంది.



విలపిస్తున్న శ్రీనివాస్ తల్లి రాజమ్మ, కుటుంబ సభ్యులు



శ్రీనివాస్ కూతురు, కుమారుడు, భార్య



వలస జీవుల మృతదేహాలు

అక్క ఆశీర్వాదం కోసం వచ్చి.. తిరిగిరాని లోకాలకు

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భానుప్రకాష్(ఫైల్)

ఐనవోలు: అక్క ఆశీర్వాదం కోసం వచ్చిన తమ్ముడు రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఈ ఘటన మండలంలోని కొండపర్తి గ్రామంలో జరిగింది. మామునూరుకు చెందిన ఎర్ర భాను ప్రకాష్ (26) మంగళవారం రాత్రి కొండపర్తిలో నివాసమంటున్న తన అక్కాబావ మాదాసు భార్గవి, శ్రీధర్ ఇంటికి వచ్చాడు. బుధవారం సాయంత్రం బైక్‌పై మామునూరుకు వెళ్తున్నాడు. అదే సమయంలో వరంగల్ నుంచి కొండపర్తికి ఆటో వస్తుంది. ఈ క్రమంలో కొండపర్తి గ్రామ చివర మలుపు వద్ద ఎదురెదురుగా ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో భాను ప్రకాష్‌కు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు ఎంజీఎం తరలించారు. అయితే భానుప్రకాష్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, భాను ప్రకాశ్‌కు గాయత్రితో వివాహం కాగా ఇటీవల కొడుకు జన్మించాడు. మంగళవారం కొడుకుకు 21 రోజు ఫంక్షన్‌ను చేశాడు. మరుసటి రోజు అక్క ఆశీర్వాదం తీసుకోవడం వారి సంప్రదాయం. దీంతో అతను కొండపర్తికి వచ్చినట్లు స్థానికులు తెలి పారు. ఈ ఘటనపై మృతుడి పెద్దనాన్న కొడుకు భరత్ ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. భాను ప్రకాష్ మామునూరు బెటాలియన్‌లో అవుట్ సోర్సింగ్ కుక్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.